

బండి..జగమొండి

వెంకటగిరి రూరల్ : ఆపదలో ఆదుకోవాల్సిన 108 మొరాయించింది. ఈ ఘటన శుక్రవారం వెంకటగిరి పీహెచ్‌సీ వద్ద చోటుచేసుకుంది.



దారికాచిన మృత్యువు

మృత్యువు దారి కాచింది. ఫారెస్ట్ వాచర్ ప్రాణాలు తీసింది. అతని బంధువులు, కుటుంబ సభ్యులకు కన్నీళ్లు మిగిల్చింది.

- 8లో



మహిళ ఆత్మహత్యపై విచారణ

రాపూరులో గిరిజన మహిళ ఆత్మహత్యపై విచారణ చేపడుతున్నట్లు ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ తెలిపారు.

- 8లో

న్యూస్‌రీల్

రేపు రాష్ట్ర స్థాయి జూడో అండర్-17 పోటీలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రాష్ట్ర స్థాయి జూడో అండర్-17 స్కూల్‌గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం రాజేశ్వరి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందులో 13 జిల్లాల జట్లకు చెందిన బాల, బాలికలు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన బాలుర జట్టు జమ్ముకశ్మీర్లో, బాలికల జట్టు అస్సాంలో పాల్గొంటాయని పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీలు స్కూల్‌గేమ్స్ తిరుపతి జిల్లా కార్యదర్శి బాబు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు.

భారీగా వరద నష్టం



తడ మండలంలోని వేనాడు గ్రామంలో దెబ్బతిన్న వరి పంట

తిరుపతి అర్బన్: జిల్లాలో మూడు రోజుల పాటు కురిసిన వర్షాలకు భారీ నష్టం వాటిల్లింది. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు వర్షాలు కురవగా.. 17, 18 తేదీల్లో ఆయా శాఖలకు చెందిన అధికారులు నష్టాన్ని అంచనాలు వేసే పనిలో పడ్డారు. ప్రధానంగా వ్యవసాయశాఖకు సంబంధించి 3,500 ఎకరాల్లో నారుమళ్లు దెబ్బతిన్నట్లు లెక్కలుగట్టారు. తడ మండలంలో 50 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. అలాగే 30 ఎకరాల్లో ఉద్యానపంటలకు నష్టం వాటిల్లింది. సెరికల్చర్ నష్టాల లెక్కలు ఇంకా నిగ్గుతేలాల్సి ఉంది. ఆర్‌అండ్‌బీ రోడ్లుకు ప్యాచింగ్ పనులకే రూ.9 కోట్లు, శాశ్వత రోడ్ల ఏర్పాటుకు రూ.70 కోట్లు కేటాయించాల్సి ఉంది. మరో వైపు పంచాయతీరాజ్ పరిధిలోని ప్యాచింగ్ పనులకు రూ.15 లక్షలు, శాశ్వత పనులకు రూ.2 కోట్లు మంజూరు చేయాలని అధికారులు చెబుతున్నారు. పశుసంవర్ధక శాఖ పరిధిలో మూడు గొర్రెలు, రెండు మేకలు, ఆరు పశువులు మృతి చెందాయి. కోళ్లఫారాలకు నష్టం తప్ప లేదు. ఇరిగేషన్ పరిధిలో కరకట్టలు, తూములు, కలుజులకు సంబంధించి 45 చోట్ల దెబ్బతిన్నాయి. వీటికి తక్షణ సాయంగా రూ.2 కోట్ల మేరకు ఖర్చు చేయాల్సి ఉంది. అదేవిధంగా ఆర్టీసీకి 1.2 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

లింగ నిర్ధారణ నేరం



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీన

గూడూరు రూరల్: గర్భస్థ లింగనిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డివిజన్ స్థాయి అడ్వయిజరీ కమిటీ సభ్యులకు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన సూచించారు. గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన శుక్రవారం గూడూరు డివిజన్ పరిధిలోని వైద్యులు, ఐసీడీఎస్ అధికారులు, ప్రవేటు వైద్యలతో పాటు అడ్వయిజరీ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ కోసం కొంత మంది కుటుంబ సభ్యులు వైద్యులపై ఒత్తిడి తీసుకుని వస్తుంటారని, అలాగే మరికొంత మంది వైద్యులు తమ ప్రాక్టీస్‌ను పెంచుకునేందుకు ముందస్తుగా సమాచారం అందించే అవకాశం ఉందన్నారు. దీనిని పూర్తిగా అరికట్టేలా చూడాలని చెప్పారు. సమాజంలో ఆడ, మగ ఇద్దరూ సమానమేనన్నారు. డెప్యూటీ డీఎంహెచ్‌ఓ పద్మావతి, డీఈఎంఓ బాబు, నెహ్రూరెడ్డి పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై సిరుల తల్లి



భక్తులను కటాక్షిస్తున్న శ్రీవారి పట్టపురాణి

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. తదుపరి ఆలయ ఆవరణలోని శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని పాంచరాత్ర ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవను చేపట్టారు. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకారభూషితురాలైన అమ్మవారు బంగారు తిరుచ్చిపై ఆశీనులై, నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

నాడు నాణ్యమైన వైద్యం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యారంగానికి పెద్ద పీట వేసింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నాడు-నేడుతో సమోన్నతంగా తీర్చిదిద్దింది. తప్పనిసరిగా ఇద్దరు డాక్టర్లు ఉండేలా చర్యలు చేపట్టింది. లక్షల రూపాయలు వెచ్చించి వైద్య పరికరాలు అందించడంతోపాటు పీహెచ్‌సీల్లోనే 64 పరీక్షలు నిర్వహించేలా ఆదేశాలు జారీచేసింది. సుఖ ప్రసవాలు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. మందులు, మాత్రలతో పాటు సిబ్బంది కొరతను పూర్తిగా నివారించింది. ప్రతి పీహెచ్‌సీలోనూ 14 మంది వైద్య బృందం రోగులకు సేవలందించేలా జాగ్రత్తలు తీసుకుంది. డాక్టర్ల డుమ్మాకు చెక్ పెట్టింది. గర్భిణులకు అన్ని రకాల సేవలు అందిస్తూ శభాష్ అనిపించుకుంది. ఈ క్రమంలో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టింది.

నేడు ప్రయివేటు పరం

కూటమి ప్రభుత్వం పీహెచ్‌సీలను గాలికొదిలేసింది. దీన్ని అలుసుగా చేసుకుని కొందరు డాక్టర్లు విధులకు డుమ్మా కొడుతున్నారు. కొన్ని చోట్ల ఒక డాక్టరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. కొంతమంది సిబ్బంది కూడా ఇదే తరహాలో వ్యవహరిస్తున్నారు. 24 గంటల వైద్యసేవలు వెదికినా ఎక్కడా కానరావడం లేదు. కొన్నిచోట్ల మధ్యాహ్నానికే పీహెచ్‌సీలు మూతబడుతుండగా.. మరికొన్ని సాయంత్రానికి తలుపులు వేసుకుంటున్నాయి. రాత్రిపూట వైద్యం అందనంత దూరంలోకి వెళ్లిపోయింది. ప్రసవ లక్ష్యం నీరుగారుతుండగా.. గర్భిణులను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సిబ్బంది, మందుల కొరత వేధిస్తోంది. ప్రయివేటు క్లినిక్‌లు కిక్కిరిసిపోతున్నాయి. ఇదేనా.. 'మంచి ప్రభుత్వం' అంటూ పేద రోగులు నిట్టూర్పులు వెళ్లగక్కుతున్నారు.



నాగలాపురంలో టెక్నీషియన్ లేక ఖాళీగా ఉన్న ల్యాబ్

తిరుపతి జిల్లా సమాచారం

పీహెచ్‌సీల సంఖ్య	58
విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	483
డాక్టర్ల సంఖ్య	102
పీహెచ్‌సీలో ఉండాల్సిన వైద్య బృందం	14

నెల	ఓపీల సంఖ్య	జ్వరం కేసులు	డెంగీ కేసులు
జూలై	144700	3400	14
ఆగస్టు	146243	4,480	29
సెప్టెంబర్	141243	5300	39
అక్టోబర్	56744	2439	16

పల్లె నాడి విలవిల!

- పీహెచ్‌సీల్లో పడకేసిన వైద్యం
- సమయ పాలన పాటించని డాక్టర్లు
- ల్యాబ్ అసిస్టెంట్ల కొరతతో మూలనపడ్డ పరికరాలు
- వర్షాల కారణంగా ప్రబలుతున్న వ్యాధులు
- కిక్కిరిస్తున్న ప్రయివేటు క్లినిక్‌లు
- వెలవెలబోతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు
- నిర్వహణను గాలికొదిలేసిన కూటమి నేతలు



ఏర్పేడు మండలం, పాపానాయుడుపేట పీహెచ్‌సీలో ఖాళీగా డాక్టరు కుర్చీ

తిరుపతి జిల్లాలోని పాపానాయుడుపేటలో శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు డాక్టర్లు ఎవ్వరూ లేరు. ఇందులో ఒక డాక్టరు డీఎం అండ్‌హెచ్‌ఓ ఆఫీసులో జరిగే సమావేశానికి వెళితే.. మరో డాక్టర్ కుక్కలగుంటలో జరిగిన ఫ్యామిలీ ఫిజీషియన్‌కు వెళ్లారు. దీంతో అక్కడి సిబ్బంది రోగులకు తూతూమంత్రంగా చికిత్సచేసి మందులు, మాత్రలు ఇచ్చి పంపించేశారు. ఐడ్రాప్స్, కొన్ని రకాల మందులు ఇక్కడ దొరకడం లేదని రోగులు తెలిపారు.

... జిల్లాలో ఈ ఒక్క పీహెచ్‌సీనే కాదు.. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ ఇదే పరిస్థితి. నాలుగు నెలలుగా పీహెచ్‌సీల నిర్వహణ గాలికొదిలేయడంతో రోగుల ప్రాణాలు గాల్లో దీపంలా కొట్టుమిట్టాడుతున్నాయి. అధిక మొత్తంలో డబ్బులు వెచ్చించి ప్రయివేటు వైద్యం చేయించుకోలేక.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అరకొర వైద్యం పొంది ఉపశమనం పొందలేక అల్లాడిపోతున్నారు. శుక్రవారం జిల్లాలోని పీహెచ్‌సీల్లో అందుతున్న వైద్య సేవలు.. రోగుల పరిస్థితులను 'సాక్షి' బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది.

కాణిపాకం: తిరుపతి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు దయనీయంగా మారాయి. అరకొర ఓపీలు రోగుల ఆరోగ్యాన్ని మెలిపెడుతున్నాయి. చాలాచోట్ల ఒంటిపూటకే సెంటర్లు తలుపులు మూసుకుంటున్నాయి. 24 గంటల వైద్యానికి తూట్లు పొడుస్తున్నాయి. ఈ క్రమంలోనే డాక్టర్లు, సిబ్బంది విధులకు డుమ్మా కొడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చూపించుకునే స్తోమత లేక పేదలు విషజ్వరాలు, డెంగీ, డయేరియా బారిన పడి ప్రాణాలు వదులుతున్నారు.

రోగులకు 'పరీక్షే'

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి పీహెచ్‌సీకి లక్షలాది రూపాయలు వెచ్చించి ల్యాబ్ పరికరాలను అందజేసింది. ఆయా పీహెచ్‌సీల్లో 63 రకాల పరీక్షలు చేసేలా చర్యలు చేపట్టింది. కానీ డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యంతో ఇప్పుడు కనీసం 20 పరీక్షలు కూడా చేయడం లేదు. ల్యాబ్ అసిస్టెంట్ల కొరత వేధిస్తోంది. ల్యాబ్ పరీక్షలు చేయాలంటే జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రి, ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేయడం రివాజుగా మారుతోంది. పీహెచ్‌సీల్లో పని చేసే కొందరు ల్యాబ్ అసిస్టెంట్లు ఆస్పత్రులకు సమీపంలోనే ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకుని అక్కడికి రెఫర్ చేయించుకుంటున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు కూడా అందుతున్నాయి.

వైద్యం..నామమాత్రం!

జిల్లాలో 58 పీహెచ్‌సీలుండగా.. వీటిల్లో ఇద్దరు చొప్పున డాక్టర్లు, 12 మంది చొప్పున సిబ్బంది పనిచేయాల్సి ఉంది. కానీ కొన్నిచోట్ల సిబ్బంది కొరత వేధిస్తోంది. చాలామంది డాక్టర్లు అటెండెన్స్ వేసి విధులకు డుమ్మా కొడుతున్నారు. మరికొంతమంది ఓపీలను కూడా క్రింది స్థాయి సిబ్బందికి అప్పగించి మధ్యాహ్నానికే వెళ్లిపోతున్నారు. సీజనల్ ప్రభావంతో డెంగీ, డయేరియా, విషజ్వరాల బారినపడిన రోగులు సరైన వైద్యం అందక నరకం అనుభవిస్తున్నారు. కొందరు విధిలేని పరిస్థితుల్లో ప్రయివేటు ఆస్పత్రుల తలుపు తడుతుండగా.. మరికొందరు దేవుడిమీద భారమేసి ఇంటికే పరిమితమవుతున్నారు. రాత్రిపూట ప్రసవాలకొచ్చే గర్భిణులు, క్షతగాత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. విలేజ్ హెల్త్ క్లినిక్‌లోని పలువురు సిబ్బంది సేవలకు స్వస్తి చెబుతున్నారు.

పెరుగుతున్న డెంగీ కేసులు

జిల్లాలో డెంగీ కేసులు పెరుగుతున్నాయి. వాతావరణ పరిస్థితులు.. వర్షాల కారణంగా దోమలు విజంభిస్తున్నాయి. జిల్లాలో జూలై నుంచి ఇప్పటివరకు 98 డెంగీ కేసులు నమోదయ్యాయి. నివేదికల్లో మాత్రం అధికారులు ప్రగతిని చూపిస్తున్నారు. డెంగీ, డయేరియా, విష జ్వరాల బారినపడితే రోగిని ఇన్ పేషెంట్‌గా చేర్చుకోవడం లేదు. ప్రైవేటు, పెద్దాస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. దీంతో పేద రోగులు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చూపించుకునే స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. చివరకు ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తూ..ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. ఇలాంటి ఘటనే ఇటీవల గూడూరులో చోటు చేసుకుంది.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



పీహెచ్‌సీల్లో సమయపాలన అవసరం. డాక్టర్లు విధిగా డ్యూటీలకు వెళ్లాలి. ఒక డాక్టరు ఓపీ చూస్తే..మరో డాక్టర్ పల్లెకు పోవాలి. సొంత పనులకు వెళ్లినట్లు తెలిస్తే కఠిన చర్యలు ఉంటాయి. నిర్లక్ష్యం వహించే వారికి నోటీసులు జారీచేస్తాం. సిబ్బంది 24 గంటలు పనిచేసేలా చూడాల్సిన బాధ్యత పీహెచ్‌సీ వైద్యులపై ఉంది.

–శ్రీహరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, తిరుపతి



నెలబల్లిలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

గారడీ మాటలతో కూటమి నేతలు ప్రజలను బోల్తా కొట్టిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్ల రూపురేఖలు మారుస్తామంటూ జబ్బలు చరిచి ఇప్పుడు చేతులెత్తేశారు. నాలుగు నెలలవుతున్నా రోడ్లపై ఏర్పడ్డ గుంతలకు అతుకులు వేసేందుకూ నిధులివ్వకుండా వేధిస్తున్నారు. వాహనదారుల ప్రాణాలు పోతున్నా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

కూటమి దారిద్ర్యం!



అధ్వానంగా ఉన్న వరదయ్యపాళెం-తడ ప్రధాన రోడ్డు

- అస్తవ్యస్తంగా ఆర్‌అండ్‌బీ రోడ్లు
- ఇంకా విడుదల కాని నిధులు
- గతుకుల రోడ్లకు అతుకులు కూడా వేయలేని దుస్థితి
- అష్టకష్టాలు పడుతున్న వాహనదారులు

వరదయ్యపాళెం: జిల్లాలో ఆర్‌అండ్‌బీ రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. కనీసం గుంతలకు అతుకులు వేయాలన్నా నిధులు లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. రోడ్ల నిర్వహణకు ప్రతి ఏడాదీ విడుదల చేసే మెయింటెనెన్స్ నిధులు సైతం కూటమి ప్రభుత్వం ఈ సారి విడుదల చేయలేదు. దీంతో వరుసగా కురుస్తున్న వర్షాలకు ఎక్కడ చూసినా ఆర్‌అండ్‌బీ రోడ్లు బావులను తలపిస్తున్నాయి. ఈ రోడ్లపై ప్రయాణం ప్రాణాల మీదికొస్తోందని పలువురు ఆవేదన చెందుతున్నారు.

దూరమైన నిధులు

కూటమి ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు రోడ్ల నిర్వహణ నిధుల గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. గత ప్రభుత్వాల్లో ప్రతి ఏడాదీ రోడ్ల నిర్వహణకు సంబంధించి జూన్, జులై మాసాలలో నిధులు మంజూరు చేసింది. అప్పటి నుంచి ఆ నిధులతో పక్క సంవత్సరం ఫిబ్రవరి వరకు రోడ్లకు సంబంధించి మెయింటెనెన్స్ చేపట్టేవారు.

నిధులు మంజూరు ఇలా..

ప్రతి ఏడాదీ రోడ్ల నిర్వహణకు ప్రభుత్వం కొంత మేరకు నిధులు మంజూరు చేస్తుంది. ఆ మేరకు కి.మీకు రూ. 20వేలు చొప్పున గత ప్రభుత్వంలో తిరుపతి డివిజన్ పరిధిలోని ఐదు సబ్ డివిజన్లకు నిధులు మంజూరయ్యాయి. తిరు పతి ఆర్‌అండ్‌బీ డివిజన్ పరిధిలో 1,260 కి.మీల మేరకు రోడ్లు భవనాల శాఖకు సంబంధించిన రోడ్లు ఉన్నాయి. ఈ రోడ్లకు సంబంధించి మెయింటెనెన్స్ కోసం ఈ ఏడాది రూ. 2.52 కోట్లు అవసరముంది. అయితే ఇప్పటి వరకు ఈ నిధులు విడుదల కాలేదు.

ఛిద్రమైన రోడ్లు

తిరుపతి ఆర్‌అండ్‌బీ డివిజన్ పరిధిలో రోడ్ల పరిస్థితి రోజురోజుకు అధ్వానంగా మారుతోంది. ఇదే పరిస్థితి కొద్దిరోజులు కొనసాగితే కొన్నిచోట్ల వాహనాలు రోడెక్కలేని పరిస్థితి దాపురిస్తుంది. తిరుపతి సబ్ డివిజన్‌లో శ్రీకాళహస్తి, పుత్తూరు, చంద్రగిరి, తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, సబ్ డివిజన్లు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోని ఆర్ అండ్ బీ రోడ్లకు ప్యాచ్‌లు వేసి నెలలు గడుస్తోంది.

తిరుపతి ఆర్ అండ్ బీ సబ్ డివిజన్ల పరిధిలో రోడ్ల వివరాలు

సబ్ డివిజన్ పేరు	రోడ్ల దూరం (కి.మీలలో)
శ్రీకాళహసి	350
పుత్తూరు	240
చంద్రగిరి	340
తిరుపతి రూరల్	160
తిరుపతి అర్బన్	170
మొత్తం	1260

నిత్యం ప్రమాదాలు



ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరి బావులను తలపిస్తున్నాయి. నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

–త్యాగరాజు, వరదయ్యపాళెం


వాహనాలు నడపలేకపోతున్నాం



నేను ట్యాక్సీ కారు ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ప్రస్తుతం రోడ్ల పరిస్థితి చూస్తే వాహనాన్ని రోడెక్కించాలంటే భయమేస్తోంది. వరదయ్యపాళెం నుంచి తడ, సత్యవేడు మార్గాల్లో వెళ్లాలంటే వాహనదారుల పాట్లు వర్ణనాతీతం.

–గురవయ్య, ట్యాక్సీ యజమాని, వరదయ్యపాళెం

ప్రభుత్వానికి నివేదించాం



నిధుల మంజూరుకు సంబంధించి ప్రభుత్వానికి నివేదించాం. రోడ్ల మెయింటెనెన్స్‌కు, ఎఫ్‌డీఆర్‌కు అవసరమైన నిధుల గురించి విన్నవించాం. –మధుసూదనరావు, ఆర్‌అండ్‌బీ జిల్లా అధికారి, తిరుపతి



బావులను తలపిస్తున్న సత్యవేడు-వరదయ్యపాళెం రోడ్డు



గుంతలమయంగా చిన్న పాండూరు-నాగలాపురం రోడ్డు



అస్తవ్యస్తంగా ఉన్న పెద్ద పాండూరు రోడ్డు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీబీఐ సోదాలు



రికార్డులను పరిశీలిస్తున్న సీబీఐ అధికారులు

చంద్రగిరి: చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం కర్ణాటకకు చెందిన సీబీఐ అధికారుల సోదాలు నిర్వహించడం కలకలం రేపింది. శ్రీకాళహస్తికి చెందిన రావూలూరి శ్రీనివాసులునాయుడు కర్ణాటకలోని చిత్రదుర్గ నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 2022లో ఆయనపై అక్రమ ఆస్తుల కేసు నమోదైంది. దీంతో అప్పట్లో శ్రీనివాసులు నాయుడుతో పాటు వారి కుటుంబ సభ్యులపై ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయకూడదని సీబీఐ ఆదేశించింది. ఈ క్రమంలో శుక్రవారం సీబీఐ అధికారులు కార్యాలయానికి చేరుకుని శ్రీనివాసులు నాయుడుతో పాటు కుటుంబ సభ్యులపై నమోదైన అక్రమ ఆస్తుల కేసుపై విచారణ చేపట్టారు. చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వారి పేర్లపై రిజిస్ట్రేషన్ అయిన వివరాలు, ఆస్తులు, విక్రయించిన వివరాలకు సంబంధించిన రికార్డులను సీబీఐ డీఎస్పీ మహేష్, సీఐ షైనీ పరిశీలించారు.

పేదలకు నాణ్యమైన వైద్యమే లక్ష్యం

తిరుపతి తుడా: పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం ఎస్వీ వైద్య కళాశాల సమావేశ మందిరంలో ఆయన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలిసి రుయా అభివృద్ధి సొసైటీ సమావేశంలో పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మూడు మహాప్రస్థానం వాహనాలను అందించనున్నట్లు తెలిపారు. రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్ రవిప్రభు గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పలు అంశాలకు కమిటీ ఆమోద ముద్ర వేసింది. కమిషనర్ ఎన్.మౌర్య, రుయా వర్కింగ్ కమిటీ చైర్మన్ బీ.లక్ష్మీపతి, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ శివరామిరెడ్డి, జిల్లా వైద్యాధికారి శ్రీహరి, డాక్టర్ ఆనందమూర్తి పాల్గొన్నారు.

ఆ డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోండి


వీసీకి వినతి పత్రం అందిస్తున్న జేఏసీ అధ్యక్షుడు ఉపేంద్ర

తిరుపతి సిటీ: డిగ్రీ విద్యార్థులను పాత అరియర్స్ ఉన్నాయంటూ పరీక్ష ఫీజులు కట్టించుకోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ ఎస్వీయూ అధ్యక్షులు ఎం.ఉపేంద్ర డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆయన శుక్రవారం వీసీ సీహెచ్ అప్పారావును కలసి వినతి పత్రం అందజేశారు. అనంతర ఆయన మాట్లాడుతూ ఎస్వీయూ పరిధిలోని ప్రైవేటు యాజమాన్యాలు విద్యార్థులను ఫీజుల పేరుతో పీక్కు తింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం సెమిస్టర్ పరీక్షల ఫీజు గడువు సమీపిస్తున్నా పాత సెమిస్టర్ ఫీజులు చెల్లించాలంటూ ఒత్తిడి చేయడం దారుణమన్నారు. వెంటనే వర్సిటీ అధికారులు సమస్యను పరిష్కరించాలని, లేనిచో పోరాటాలు తప్పవని హెచ్చరించారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం అర్ధరాత్రి వరకు 58,637 మంది స్వామి వారిని దర్శించుకోగా 21,956 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి హుండీ కానుకలు రూ.3.69 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. నిర్దేశిత సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

దారికాచిన మృత్యువు!

పెద్దకన్నలి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ప్రమాదస్థలాన్ని చూపబోయి అనంతలోకాలకు చేరిన ఫారెస్ట్ వాచర్
- శ్రీకాళహస్తి-నాయుడుపేట మార్గంలో ఘటన


మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న డీఎఫ్ఓ వివేక్

రేణిగుంట: 'విధి ఎంత బలీయమైనదో' ఈ ఘటన ఓ తార్కాణం. తనకు ఏ మాత్రం సంబంధం లేని ఒక ఘటనలో రక్షకభటులకు సహాయకారిగా వెళ్లి అక్కడ చోటుచేసుకున్న ప్రమాదంలో ఓ చిరుద్యోగి అలంతలోకాలకు చేరిపోయాడు. అయినవాళ్లకు తీరని శోకాన్ని మిగిల్చాడు. ఈ ఘటన తొట్టంబేడు మండలం, పెద్దన్నకలి ఎస్టీ కాలనీ సమీపంలో చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి టూటౌన్ సీఐ వెంకటేశు తెలిపిన వివరాలు.. గురువారం అర్ధరాత్రి 12.30 గంటల సమయం.. శ్రీకాళహస్తి–నాయుడుపేట మార్గం, పెద్దకన్నలి ఎస్టీ కాలనీ సమీపంలో కేరళ నుంచి ఒడిశా వెళుతున్న టూరిస్ట్ బస్సు, కట్టెల లోడ్డుతో శ్రీకాళహస్తి వైపు వస్తున్న ఓ ట్రాక్టర్ ఢీకొన్నాయి. బసవయ్యపాళెం సమీపంలోని ఫారెస్ట్ చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న ఫారెస్ట్ వాచర్ బీ.వెంకటేష్(32)కు సమాచారం వచ్చింది. ఆయన టూటౌన్ సమీపంలోనే ఉన్న హైవే మొబైల్ పోలీసులకు తెలిపాడు. ప్రమాద స్థలాన్ని చూపించాలని హైవే మొబైల్ పోలీసు సిబ్బంది అనిల్, సుబ్రమణ్యం అతనిని కోరడంతో, వారితోపాటు పోలీసు సుమోలో పెద్ద కన్నలి ఎస్టీ కాలనీలోని ప్రమాద స్థలానికి వెళ్లారు. అక్కడ పోలీసులిద్దరూ సుమో దిగి ఘటనా స్థలాన్ని పరిశీలిస్తుండగా వాచర్ వెంకటేష్ సుమోలోనే కూర్చుని ఉన్నాడు. వారు కిందకు దిగిన కొద్ది క్షణాల వ్యవధిలో శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేట వైపు వెళుతున్న ఓ ఈచర్ వాహనం అతివేగంగా వచ్చి పోలీసు సుమో ను ఢీకొంది. సుమో దూసుకెళ్లి కట్టెల లోడ్డులో ఇరుక్కుంది. ఫారెస్ట్ వాచర్ వెంకటేష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసు సిబ్బంది అనిల్, సుబ్రమణ్యంకు స్వల్ప గాయాలయ్యాయి. వెంకటేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ పేర్కొన్నారు.

కిందకి దిగి ఉంటే మృత్యువు తప్పేదేమో!

తొట్టంబేడు మండలం, బసవయ్యపాళెం ఎస్టీ కాలనీకి చెందిన బీ.వెంకటేష్‌కు భార్య పద్మజ, పిల్లలు బీ.చెంచమ్మ(08), బీ.మోహిత్(04) ఉన్నారు. పదేళ్లుగా ఫారెస్ట్ చెక్‌పోస్ట్‌లో ప్రొటెక్షన్ వాచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. యథావిధిగా గురువారం రాత్రి బసవయ్యపాళెం సమీపంలోని ఫారెస్ట్ చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తుండగా, పోలీసు సిబ్బంది తమ వెంట తీసుకెళ్లారు. అయితే పోలీసు సిబ్బందితోపాటు వెంకటేష్ కూడా సుమో దిగి ఉంటే మృత్యుగండం తప్పేది. కానీ సుమోలోనే కూర్చుని అనూహ్య ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. కటిక పేదరికాన్ని జయించి చిరుద్యోగం సంపాదించి భార్య, పిల్లలతో అన్యోన్యంగా జీవితాన్ని గడుపుతున్న వెంకటేష్ లేడన్న చేదువార్త విని అతని భార్య పద్మజ, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.



మృతి చెందిన వెంకటేష్, మృతుడు (ఫైల్)

నివాళి అర్పించిన డీఎఫ్ఓ

రోడ్డు ప్రమాదంలో ఫారెస్ట్ వాచర్ వెంకటేష్ మృతి చెందిన విషయం తెలుసుకున్న డీఎఫ్ఓ పీ.వివేక్, ఎఫ్ఆర్ఓ లోకేష్ బసవయ్యపాళెం ఎస్టీ కాలనీకి చేరుకుని అతని మృతదేహంపై త్రివర్ణ పతాకాన్ని కప్పి ఘన నివాళి అర్పించారు. మృతుని భార్య పద్మజ, పిల్లలను ఓదార్చారు. మృతుని భార్యకు కారుణ్య నియామకాల్లో ఉద్యోగం ఇప్పించేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని హామీ ఇచ్చారు.

గ్రామ ఆచారం
ఊరి బయటే మృతదేహం

ఊరి బయట మరణిస్తే ఊళ్లోకి మృతదేహాన్ని తీసుకురాకుండా గ్రామ శివారునే ఉంచి అక్కడి నుంచే అంతిమ సంస్కారాలు చేయాల్సిన మూఢాచారం నేటికీ చాలా గ్రామాల్లో ఉంది. ఊరి బయట మృతి చెందడంతో గ్రామ ఆచారం ప్రకారం వెంకటేష్ మృతదేహాన్ని బసవయ్యపాళెం ఎస్టీ కాలనీ శివారున ఓ షామియానా కింద ఉంచారు. మృతుని కుటుంబీకులు, బంధువులు అక్కడకు చేరుకుని గుండెలు బాధుకుంటూ రోదించారు. మృతుని పిల్లలు చెంచమ్మ, మోహిత్ తండ్రి మృతదేహాన్ని చూసి దీనంగా చూస్తూ ఉండిపోయారు. లేయ్ నాన్నా.. మమ్మల్ని ఒకసారి చూడు... అంటూ తండ్రి మృతదేహం వద్ద కన్నపేగులు అలమటిస్తున్న తీరు అక్కడి వారి కంటతడి చెంపను నిమిరింది.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి


మణి (ఫైల్)


రాము (ఫైల్)

నాగలాపురం: పిడుగుపాటుకు పిచ్చాటూరు మండలంలో శుక్రవారం ఇద్దరు మృతిచెందారు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హనుమంతాపురం గ్రామానికి చెందిన దామోదరం పొలంలో కొందరు కూలి పనులు చేస్తున్నారు. ఆ సమయంలో భారీ వర్షంతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగు పొలంపై పడింది. ఆ సమయంలో పొలంలో పనిచేస్తున్న మణి(54), రాము(50) అక్కడిక్కడే మృతిచెందారు.

మహిళ ఆత్మహత్యపై విచారణ

రాపూరు: మండలంలోని గిలకపాడు సమీపంలోని సిమెంటురాళ్ల తయారీలో పనిచేసే గిరిజన మహిళ ఏకోలు చెంచులక్ష్మి ఇటీవల ఆత్మహత్య చేసుకుంది. దీనిపై ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ శుక్రవారం రాపూరు పోలీస్‌స్టేషన్‌లో విచారణ చేపట్టారు. అనంతరం ఆయన పెండింగ్‌లోని కేసులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు.ఆయన వెంట ఎస్ఐ వెంకటరాజేష్ ఉన్నారు.

వృద్ధురాలిని గెంటేసి.. దుకాణం ఆక్రమణ


బాధితురాలు ధనమ్మతో కలసి నిరసన చేస్తున్న బీజేపీ నాయకులు

చంద్రగిరి: తనకు అమ్మగారి ఆస్తిని సమీప బంధువులు కాజేసేందుకు కుట్రపన్ని వృద్ధురాలని కూడా చూడకుండా బయటకు గెంటేసిన ఘటన శుక్రవారం స్థానిక చంద్రగిరి కొత్తపేటలో చోటు చేసుకుంది. బాధితురాలి వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరానికి చెందిన మునికృష్ణారెడ్డి భార్య ధనమ్మకు పుట్టింటి వాళ్లు 40 ఏళ్ల క్రితం కొత్తపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఎదురుగా సర్వే నంబరు 61/2లో 18 అంకణాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. అనంతరం ఆమె దుకాణం ఏర్పాటు చేసుకుని ఇంటి పన్ను, విద్యుత్ బిల్లులు చెల్లించుకుంటూ దుకాణంపై వచ్చే బాడుగతో జీవనం గడుపుతోంది. వీరి ముగ్గురు కుమార్తెలకు వివాహం చేశారు. రెండు నెలల క్రితం భర్త చనిపోవడంతో దుకాణంపై ఆధారపడి ధనమ్మ కాలాన్ని నెట్టుకొస్తోంది. ఈ క్రమంలో ఆమె సమీప బంధువులు నకిలీ పత్రాలను సృష్టించి గుట్టు చప్పుడు కాకుండా ఇంటి పన్ను, విద్యుత్ మీటరును మార్చేశారు. దీంతో బాధితురాలు అధికారులను నిలదీయడంతో తిరిగి ధనమ్మ మార్చారు. ఈ క్రమంలో శుక్రవారం ధనమ్మకు సంబంధించిన సంబంధించిన బంధువులు మునెమ్మ, సుజాత, దేవారెడ్డి, మునిరెడ్డి, ద్వారకానాథరెడ్డి అక్కడకు చేరుకున్నారు. వృద్ధురాలిని బలవంతంగా దుకాణం నుంచి బయటకు లాగేశారు. దుకాణం తాళాలను పగలగొట్టి అక్రమంగా ఆక్రమించుకున్నారు. సమాచారం అందుకున్న స్థానిక మహిళలు, బీజేపీ నాయకులు అక్కడకు చేరుకుని వృద్ధురాలి ఆస్తిని కాజేయాలని చూడడం దారుణమన్నారు. వెంటనే వృద్ధురాలి వద్దకు చేరుకుని ఆమెను పరామర్శించి, అనంతరం ఆమెతో కలసి నిరసనకు దిగారు. దీనిపై విచారించి న్యాయం చేయకపోతే ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్‌కు ఘన స్వాగతం


వెంకటేశన్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు

రేణిగుంట: తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా పలు కార్యక్రమాలలో పాల్గొనేందుకు శుక్రవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేశన్‌కు ఘన స్వాగతం లభించింది. జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి తదితరులు సాదర స్వాగతం పలికారు. ఈ నెల 20 వరకు తిరుపతి, చిత్తూరు జిల్లాలో స్కావెంజర్ అండ్ రిహాబిలిటేషన్ యాక్ట్ అమలును సమీక్షించనున్నారు. 19వ తేదీ శ్రీవారిని దర్శించుకుంటారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం 20వ తేదీన ఉదయం 9.10 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని ఢిల్లీకి తిరుగు ప్రయాణం కానున్నారు.

ఆశ కార్యకర్త ఆత్మహత్యాయత్నం


వాహనం మరమ్మతులకు గురికావడంతో అంకమ్మను కిందకు దించుతున్న సిబ్బంది

వెంకటగిరిరూరల్: పొదుపు సంఘంలోని సభ్యుల మాటలు పడలేక ఆశ కార్యకర్త నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం మండలంలోని దాచెరువు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. దాచెరువు గ్రామానికి చెందిన అంకమ్మ పొదుపు సంఘం లీడర్. సోమసానిగుంటలో ఆశ వర్కర్‌గా పనిచేస్తోంది. ఇటీవల సభ్యులు కట్టిన డబ్బులు బ్యాంక్‌లో సక్రమంగా జమచేయలేదని తెలిసింది. దీంతో సభ్యులు రెండు రోజుల క్రితం బ్యాంక్‌కు వెళ్లి స్టేట్‌మెంట్ తీసుకుని వచ్చారు. తాము కట్టిన డబ్బు ఏం చేశావంటూ ఆశ కార్యకర్తను నిలదీశారు. దీంతో ఆమె మనస్తాపానికి గురైంది. శుక్రవారం విధుల నుంచి వచ్చి ఇంటి వద్ద నిద్రమాత్రలు మింగి అపస్మారక స్థితికి చేరింది. స్థానికులు హుటాహుటిన వెంకటగిరి పీహెచ్‌సీకి తరలించకగా.. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఈ మేరకు పోలీసులు వివరాలు నమోదు చేసుకోని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరమ్మతుకు గురైన 108

అంకమ్మను తిరుపతికి తీసుకెళ్లందుకు 108 వెంకటగిరి పీహెచ్‌సీకి చేరింది. ఆ తర్వాత అంకమ్మను తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా వాహనం ముందుకు కదల్లేదు. గేర్ రాడ్ విరిగిపోవడంతో పైలెట్ సుమారు ఒకటిన్నర గంటపాటు శ్రమించినా ఫలితం లేకపోయింది. మళ్లీ అంకమ్మను పీహెచ్‌సీలోకి తరలించారు. ఆ తర్వాత మరో 108 వాహనంలో తిరుపతికి తీసుకెళ్లాల్సి వచ్చింది.

మెట్ల తొలగింపు


తిరుమంజనం గోపురం వద్ద తొలగించిన మెట్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం మూడో గేటు సమీపంలో తిరుమంజనం గోపురం వద్ద ఏర్పాటు చేసిన మెట్లను తొలగించారు. గత శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం జారిపడకుండా తాత్కాలికమెట్లను ఏర్పాటు చేశారు. అయితే పాత మెట్లు 27 ఉండడంతో అవి స్వామివారికి చెందిన 27 నక్షత్రాలు అని, వాటిని ఇలా అపవిత్రం చేయడం సరికాదని భక్తుల నుంచి విన్నపాలు రావడంతో శుక్రవారం వాటిని తొలగించారు.

టీటీడీ కో–ఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికలకు సన్నద్ధం

- నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ

తిరుపతి సిటీ: టీటీడీ ఉద్యోగుల కోపరేటివ్ బ్యాంక్ ఎన్నికలకు సర్వ సిద్ధమైంది. ఏడుగురు డైరెక్టర్లతో పాటు అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. శనివారం నుంచి ఎన్నికల పర్వం ప్రారంభం కానుంది. బరిలో నిలిచిన అభ్యర్థులు తమబలగంతో నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. 20వ తేదీన నామినేషన్ల పరిశీలిన, 21న ఉపసంహరణ ప్రక్రియ చేపట్టి 28వ తేదీన పోలింగ్ నిర్వహించి అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారిగా ఉమాపతి వ్యవహరించనున్నారు.

హోరాహోరీగా ప్రచారం

ఈనెల 28న జరగనున్న టీటీడీ సహకార బ్యాంక్ ఎన్నికలలో ఏకంగా 40 మందికి పైగా అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. సుమారు 6,350మంది ఉద్యోగులు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తిరుమలలోని ఎస్వీ హైస్కూల్, తిరుపతి గోవిందరాజస్వామి హైస్కూల్‌లోని రెండు కేంద్రాలలో పోలింగ్ నిర్వహించనున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు పదుల సంఖ్యలో అంశాలను పొందుపరిచి మేనిఫెస్టోను తయారు చేసుకుని ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. టీటీడీలోని ప్రతి విభాగంలో ఎన్నికల హడావుడి కనిపిస్తోంది.